# మరో ఎన్నికల సమరం!



రాష్ట్రంలో మరో ఎన్నికల సమరంలో నామినేషన్ల ఘట్టం ప్రారంభమయింది. మండల స్థాయితో పాటు జడ్‌పిటిసి స్థానాలకు జిల్లా పరిషత్ అధ్యక్ష పదవులకు జరుగుతున్న ఈ ఎన్నికలు మరో రెండేళ్ళలో రానున్న శాసనసభ ఎన్నికలకు రిహార్సల్స్‌గా పరిగణిస్తున్నారు. 13వతేదీ నామినేషన్ల దాఖలుకు తొలిదినం కాగా రాష్ట్రవ్యాప్తంగా ఒకమోస్తరుగా అభ్యర్థులు తమ నామినేషన్లు దాఖలు చేశారు. ఈ ఎన్నికలలో ప్రజలు ఇచ్చే తీర్పు ఆధారంగా సమీప భవిష్యత్‌లో రాజకీయపార్టీలు వ్యూహ ప్రతివ్యూహాలు రూపొందిస్తాయి.

ఎన్నికలలో అనుసరించే వ్యూహాలపై రాజకీయపార్టీలు ఇప్పటికే ఒక అవగాహనకు వచ్చాయి. దీనిని బట్టి చూస్తే ఈ ఎన్నికల తర్వాత రాజకీయాల ఊహాచిత్రం ఇలా ఉండొచ్చు....

తెలంగాణా అంశమే ప్రధానాయుధంగా పోరాడుతున్న టిఆర్ఎస్ ఈ ఎన్నికల తర్వాత మరీ బలహీనపడిపోవచ్చు. కాంగ్రెస్ ఎంతో వ్యూహాత్మకంగా టిఆర్ఎస్‌ను దెబ్బతీస్తోందనే వార్తలు వినిపిస్తున్నాయి. ఇప్పటివరకూ పట్టు ఉందని భావిస్తున్న జిల్లాలలో సైతం టిఆర్ఎస్‌కు భంగపాటు తప్పకపోవచ్చు. ఇది కచ్చితంగా కాంగ్రెస్‌కు అనుకూల అంశమే. టిఆర్ఎస్‌కు ఈ పరిస్థితే వస్తే ఆ పార్టీ అనూహ్య నిర్ణయాలు తీసుకోవడం అనివార్యం అవుతుంది. కాంగ్రెస్ ఎత్తుగడలేమిటో స్పష్టంగానే తెలిసిపోవడంతో టిఆర్ఎస్ కూడా ఎవరు వెంట వస్తే వారిని కలుపుకుపోవడం మేలన్న సూత్రాన్ని పాటిస్తూ, సిపిఎంకు స్నేహ హస్తం అందించడానికి నిర్ణయించుకుంది.

వామపక్షాలు ఎంతోకొంత బలపడవచ్చు. ఇక మిగిలిందల్లా కాంగ్రెస్, తెలుగుదేశం!

తెలంగాణా జిల్లాలలో టిఆర్ఎస్‌ను బలహీనం చేయడంలో భాగంగా టిఆర్ఎస్ అసమ్మతినేతలకు ఎంతో కొంత ప్రాధాన్యం కల్పించడం అనే వ్యూహం కాంగ్రెస్‌కు మేలు చేయొచ్చు. అయితే గత శాసనసభ ఎన్నికలతో పోలిస్తే మాత్రం కాంగ్రెస్ చెప్పుకోదగిన స్థాయిలో బలపడకపోయినా నష్టపడకపోవడం అనేదే ప్రధాన లాభంగా పరిణమిస్తుంది. కరీంనగర్, మెదక్, మహబూబ్‌నగర్, ఖమ్మం జిల్లాలలో ఈ పరిస్థితి కనిపిస్తుందని అంచనా.

తెలుగుదేశం పార్టీ గత శాసనసభ ఎన్నికలతో పోలిస్తే మెరుగుపడే అవకాశం ఉంది. అప్పటిస్థాయిలో కాంగ్రెస్‌కు అనుకూలించడం కష్టం కాబట్టి తెలుగుదేశం బలం పెరుగుతుందనేది ఒక అంచనా అయితే అధికారపార్టీ పై ప్రజలలో అసంతృప్తి కొంత తోడైతే టిడిపికి ప్రయోజనం కలుగుతుందనేది మరొక వాదన.

గ్రామ, మండల స్థాయిలలో జరిగే ఇటువంటి ఎన్నికలలో సాధారణంగా ప్రభావితమయ్యేది స్థానిక అంశాలే అన్నది తిరుగులేనిది. శాసనసభ ఎన్నికలతో పోలిస్తే అంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకోకపోయినా గ్రామ, మండల స్థాయి నేతలకిది పరువు ప్రతిష్ఠలతో కూడుకున్న విషయం కాబట్టి వారే ఎక్కువగా కష్టపడతారు. కక్షలు, కార్పణ్యాలకు నిలయమైన గ్రామాలలో హింసప్రజ్వరిల్లేదీ ఇందుకే!

రానున్న పదిరోజుల్లో గ్రామాలు, మండలాలు ఎన్నికల సంరంభంతో కళకళలాడుతుంటాయి. రాష్ట్ర రాజకీయాలను ప్రభావితం చేయగలవని భావిస్తున్న ఈ ఎన్నికలు ఏ మార్పును తీసుకురానున్నాయో చూద్దాం!